పోస్టల్ బ్యాలెట్ నిర్వహణపై వికాస్‌రాజ్ పరిశీలన



ఓపీవోల సమావేశంలో పాల్గొన్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ వికాస్ రాజ్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం అదర్ పోలింగ్ ఆఫీసర్స్ శిక్షణ కార్యక్రమం శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని లేక్‌వ్యూ బంజారా ఫంక్షన్ హాల్‌లో జరిగింది. చీఫ్ ఎలక్షన్ కమిషన్ వికాస్ రాజ్ ఈ కార్యక్రమానికి విచ్చేసి ఓపీవోల పోస్టల్ బ్యాలెట్ నిర్వహణను పరిశీలించారు. పోలింగ్ రోజున ఓపీవోల పాత్ర కీలకమని ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇందులో భాగంగానే వీరికి జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రోస్ పోలింగ్ రోజున నిర్వహించాల్సిన విధి విధానాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ ఆర్వో వెంకటేష్ ధోత్రే తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రతాభాదర్శన్



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం అప్నే పేరుతో రెండో తరగతి విద్యార్థులు ప్రతిభా దర్శన్ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. ప్రతి విద్యార్థిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని ఆత్మవిశ్వాసాన్ని వెలికితీయడమే కార్యక్రమ ఉద్దేశమని ప్రాథమిక ప్రధానోపాధ్యాయురాలు విధుమోహన్ వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా మానవ సంబంధ బాంధవ్యాలను ప్రకృతితో మనిషికి గల అవినాభావ సంబంధం గురించి వివరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఆరువేల శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ... ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభాపాటవాలు వెలికితీయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాంచనవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఫిలింనగర్ పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ఫిలింనగర్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలకు మరింత భరోసా కల్పించి మేమున్నామనే ధైర్యాన్ని ఇచ్చేందుకు ఫిలింనగర్ పోలీసులు శనివారం షేక్‌పేట, టోలిచౌకి, గుల్షన్ కాలనీ, 7 టూంబ్స్ ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఏసీపీ హరి ప్రసాద్, ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణతో పాటు స్థానిక పోలీసులు, సీఆర్‌పీఎఫ్ పోలీసులు ఈ ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ధైర్యంగా ముందుకు వచ్చి ఓటు వేయాలని, ఏదైనా అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే పోలీసులకు సమాచారం అందించాలని ఏసీపీ కోరారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రజల కోసం పోరాడే వారిని గెలిపించండి



ప్రచారం చేస్తున్న డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి

శ్రీనగర్‌కాలనీ: ప్రధాన పార్టీలు ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తున్నారని, ప్రజల కోసం పోరాడే ఇండియన్ ప్రజా కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి అన్నారు. శనివారం ఎర్రగడ్డ బస్తీలలో ప్రచారాన్ని చేపట్టారు. మార్పుతోనే సంక్షేమం సాధ్యమని, ఈల గుర్తుకు ఓటువేసి ఐపీసీ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



బంజారాహిల్స్: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలంటూ బంజారాహిల్స్‌లోని రీజెన్సీ కాలేజీకి చెందిన హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలేజీ నుంచి తాజ్‌కృష్ణ, తాజ్‌దక్కన్ మీదుగా కేర్ ఆస్పత్రి వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఓటు ప్రతి ఒక్కరి భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని అంతటి ప్రాముఖ్యత ఉన్న ఓటును ప్రతి ఒక్కరూ వేసి సద్వినియోగం చేసుకోవాలంటూ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులతో పాటు, ప్రిన్సిపాల్ రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

నాకే ఓటు ఎందుకు వేయాలంటే..

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఖైరతాబాద్ నియోజకవర్గంలో గడచిన రెండు వారాలుగా ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రచారం జోరుగా సాగుతోంది. ఎవరికి వారే బస్తీలు, కాలనీల్లో ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నారు. తమ పార్టీల మేనిఫెస్టోలను ప్రజల్లోకి తీసుకెళ్తూ మద్దతు కోరుతున్నారు. మీకే ఎందుకు ఓటు వేయాలని బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్, కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి, బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డిలను ప్రశ్నించగా ప్రజా సేవ, అభివృద్ధి, తమ పార్టీ అమలుచేయబోయే సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని స్పష్టం చేస్తున్నారు. – బంజారాహిల్స్

కేసీఆర్ భరోసా...



సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలుచేయడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న కృషిని దేశం మొత్తం కీర్తిస్తున్నది. కేసీఆర్ భరోసాతోనే మేం ఈ ఎన్నికల్లో ఓట్లు అడుగుతున్నాం. హైదరాబాద్ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు చూసి ఓటు వేయాలని కోరుతున్నాం. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, గృహలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి, కేసీఆర్ ఆరోగ్య రక్ష, పింఛన్ల పెంపు తదితర పథకాలు ప్రజలను బాగా ఆకర్షిస్తున్నాయి. నియోజకవర్గంలో ఈ అయిదేళ్లలో సుమారుగా 30 వేల మంది వివిధ రకాలుగా సంక్షేమ పథకాలు అందుకున్నారు. వారందరూ బీఆర్ఎస్‌వైపే ఉన్నారని నమ్మకాన్ని పెట్టుకున్నాం.

– దానం నాగేందర్, బీఆర్ఎస్ అభ్యర్థి

పీజేఆర్ పాలన చూపిస్తా...



దివంగత సీఎల్పీ నేత మా నాన్న పీజేఆర్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా అభివృద్ధి పనులు చేయడంలో ప్రజలకు అందుబాటులో ఉంటడంలో చూపిన శ్రద్ధను ఈ ఎన్నికల్లో ప్రజల్లోకి తీసుకెళ్తున్నాను. పీజేఆర్ ఆశయ సాధనకు కట్టుబడి ఉన్న నన్ను ఈ ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలు సిద్ధంగా ఉన్నారు. రెండుసార్లు కార్పొరేటర్‌గా అవకాశం ఇస్తే ఓటర్ల నమ్మకాన్ని వమ్ముచేయకుండా నిత్యం ప్రజల మధ్య ఉండి వారి సంక్షేమానికి కృషి చేసిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేరు. ఖైరతాబాద్ ఆడపడుచుగా సోనియా గాంధీ తనను నియోజకవర్గానికి పంపించింది. ఆమె నమ్మకాన్ని ప్రజలు నిలబెట్టి ఖైరతాబాద్‌ను బహుమతిగా అందిస్తారని విశ్వసిస్తున్నాను.

– విజయారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి

ప్రజల గెలుపు కోసం



ఖైరతాబాద్ నియోజకవర్గంలో తాను గెలిస్తే అది తన గెలుపు కాదు ప్రజల గెలుపు అవుతుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలను మభ్యపెట్టి ఓట్లు అడగాలని చూస్తుంటే ప్రజలు నమ్మడం లేదు. ప్రజా సమస్యల పరిష్కారం బీజేపీ వల్లనే అవుతుందని భావిస్తున్నారు. ఏడాదికి నాలుగు సిలిండర్లు ఇవ్వబోతున్నాం. పావలా వడ్డీ రుణాలు మాఫీ చేయబోతున్నాం. సేవా భావంతో ఉండే నాయకుడిని ప్రజలు ఎన్నుకుంటారు. నేను అందరిలా పార్టీలు మారిన వాడిని కాదు సిద్ధాంతాలకు కట్టుబడిన వాడిని ఈ విషయం ప్రజలకు బాగా తెలుసు. రామ మందిరం, కాశీ విశ్వేశ్వర ఆలయాలకు ఉచితంగా నియోజకవర్గ ప్రజలను పంపిస్తాను.

– చింతల రాంచంద్రారెడ్డి, బీజేపీ అభ్యర్థి

తెలంగాణలో కాంగ్రెస్ వేవ్.. అధికారం తథ్యం



రహమత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న అజహరుద్దీన్

జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి అజహరుద్దీన్

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ అంతటా కాంగ్రెస్ గాలి వీస్తున్నదని, జూబ్లీహిల్స్‌లో అత్యధిక మెజారిటీతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తాను విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్ అన్నారు. శనివారం షేక్‌పేట, రహమత్‌నగర్‌లోని బస్తీల్లో మహారాష్ట్ర ఎమ్మెల్యే బాబా జియావుద్దీన్ సిద్దిఖీతో కలిసి ప్రచారం చేశారు. నియోజవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలు చాలా సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వాలని, హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. నేతలు కార్పొరేటర్ సీఎస్‌రెడ్డి, భవానీశంకర్, రవిగౌడ్, మోసిన్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంనగర్‌లో...

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్‌లోని శ్రీరాంనగర్, హెచ్ఎఫ్‌నగర్ బస్తీల్లో జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ అజహరుద్దీన్ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మలిదశ ఉద్యమ కారుడు ముత్యాలు తన అనుచరులతో కలిసి అజహరుద్దీన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డి, కాంగ్రెస్ నగర నాయకుడు భవానీశంకర్, సుల్తాన్, ఎక్బాల్, ఇబ్రహీం, లింగమూర్తి పాల్గొన్నారు.



షేక్‌పేటలో అజహరుద్దీన్, ఎమ్మెల్యే సిద్దిఖీ..

బీఆర్ఎస్‌కు హ్యాట్రిక్ విజయం ఖాయం: మాగంటి



మాగంటికి స్వాగతం పలుకుతున్న మహిళలు

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీతోనే ప్రజలున్నారని, బీఆర్ఎస్‌తోనే సంక్షేమం సాధ్యమని నమ్ముతున్నారని, హ్యాట్రిక్ విజయం తథ్యమని పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డిగూడ, శ్రీనగర్‌కాలనీలలో మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు. స్థానికులు హారతులతో ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్‌ను, బీజేపీని ప్రజలు విశ్వసించడం లేదన్నారు. బీఆర్ఎస్ అందించిన సంక్షేమ పథకాలు, సంక్షేమాన్ని, అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కే పట్టం కట్టాలని భావిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వనం సంగీత, నేతలు అప్పుఖాన్, మధుయాదవ్, సోను తదితరులు పాల్గొన్నారు.

చట్టాలు సక్రమంగా అమలయ్యేలా చూడాలి

పంజగుట్ట: చట్టాలు ఉన్నవి ప్రజా హక్కులు పరిరక్షించేందుకే అని హక్కులు పరిరక్షించడానికి, వాటిని సక్రమంగా అమలు పరిచేలా చూడటం మన కర్తవ్యమని తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ సభ్య కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ లా కాలేజీ విద్యార్థులకు న్యాయసేవలు, చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి చట్టాల అమలు తీరును లా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ సంస్థ కార్యదర్శి కె.వీ.చంద్రశేఖర్ రావు, కాలేజీ ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి మద్దతు: తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ్

హిమాయత్‌నగర్: ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 500 కోట్లు కేటాయిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఎరుకల సామాజికవర్గం సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కెంబసారం కష్ణ, కూరాకుల కృష్ణ ప్రకటించారు. శనివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... తెలంగాణ మూలవాసులు, ప్రభుత్వం ఎస్టీలుగా గుర్తించిన ఎరుకల కులస్తులకు రిజర్వేషన్లు కూడా దక్కడం లేదన్నారు. ఎస్టీ కార్పొరేషన్‌లో తీవ్ర అన్యాయం జరిగిందని, గిరిజన సామాజికవర్గమే విద్య, ఉద్యోగ రంగాల్లో రేజర్వేషన్లను కొట్టుకుపోతుందన్నారు. కేవలం ఎరుకల జాతిని ఓటు బ్యాంకుగా పార్టీలు వాడుకున్నాయే తప్ప చేసింది ఏమీలేదని, దళితబంధు తరహా గిరిజనులకు ఇస్తామని ఇవ్వకుండా బీఆర్ఎస్ మోసం చేసిందన్నారు. ఎరుకల సామాజికవర్గాన్ని ఎస్టీ జాబితాలో ఆనాడు కలిపింది కాంగ్రెస్ పార్టీయేనని, ఉద్యోగాలు కూడా కల్పించింది కాంగ్రెస్ అని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ్ ఆధ్వర్యంలో కృషిచేస్తామన్నారు. సమావేశంలో సంఘ్ సలహాదారుడు దేవసారి జైపాల్, ఉపాధ్యక్షులు కూతాడి రవి, నేతలు కావడి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శతచండీ మహాయాగం



మహాయాగం పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం 14లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో కొలువుదీరిన శ్రీ విజయ గణపతి ఆలయ ప్రాంగణంలో శతరుద్రయాగ సహిత శతచండీ మహాయాగం వైభవంగా ప్రారంభమైంది. శనివారం ప్రారంభమైన ఈ యాగం డిసెంబర్ 4వ తేదీ వరకు కొనసాగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు విష్ణుభట్ల ఆంజనేయ చయనులు తెలిపారు. వేడుకల్లో భాగంగా ఉదయం దీక్షాధారణ, అఖండ దీప స్థాపన, శతచండి రుద్రపారాయణాలు, గణపతి సుదర్శన నవగ్రహ జపాలు, శతచండీ రుద్రహోమాలు జరిగాయి. సాయంత్రం చంద్రమౌళీశ్వరులకు అభిషేకం, మహా మంగళహారతి నిర్వహించారు. లోక కల్యాణార్థం సకల సౌభాగ్యాలను ఆకాంక్షిస్తూ శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో ఈ కైంకర్యాలను అంగరంగ వైభవంగ నిర్వహిస్తున్నారు.

వేడుకగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవం

రహమత్‌నగర్: బ్రహ్మశంకర్‌నగర్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. వేద పండితులు లక్కోజీ రవీంద్రచారి, బ్రహ్మశ్రీ సదర్శన శర్మల నేతృత్వంలో ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డి, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ నవీన్‌యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఓర్సు అడవయ్య, బస్తీ అధ్యక్షుడు వసంత్ కుమార్ పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కుటుంబ పాలన బీజేపీతోనే అంతం



శ్రీనగర్‌కాలనీలో ప్రచారం చేస్తున్న జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి



ఎస్పీఆర్‌హిల్స్‌లో దీపక్‌రెడ్డి..

జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: దేశంలో బీజేపీ ప్రపంచం గర్వించేలా మన సత్తాను ఎలా చాటిందో, తెలంగాణలో బీజేపీని గెలిపిస్తే దేశమంతా చూసేలా బంగారు తెలంగాణను సాధించుకుందామని జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి అన్నారు. శనివారం శ్రీనగర్‌కాలనీ, ఎర్రగడ్డలో ప్రచారాన్ని నిర్వహించారు. తెలంగాణలో బీఆర్ఎస్ చేస్తున్న కుటుంబ పాలనను ప్రజలు గమనించారని, అహంకారాన్ని అణిచివేయాలంటే బీజేపీకి పట్టం కట్టాలని, కమలం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. నేతలు శాంతికుమార్, హరీష్, మహిళా నేతలు పాల్గొన్నారు.

నేడు ఎర్రగడ్డలో జేపీ నడ్డా సభ...

ఎర్రగడ్డలోని జనప్రియ అపార్ట్‌మెంట్స్ గ్రౌండ్స్ వద్ద సకల జనుల విజయ సంకల్ప సభను ఆదివారం నిర్వహించే బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు ఆ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి తెలిపారు. కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎస్పీఆర్ హిల్స్‌లో...

రహమత్‌నగర్: ఎస్పీఆర్ హిల్స్‌లో బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి శనివారం ప్రచారం నిర్వహించారు. పలు బస్తీల్లో ఇంటింటికీ తిరుగుతూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. డివిజన్ అధ్యక్షుడు కనకరాజు, నాయకులు కొలన్ సత్యనారాయణ, నేతలు చిన్న శ్రీను, మల్లేశ్‌గుప్తా, భాస్కర్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్



సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్ రోడ్ నంబర్-1లోని తాజ్‌కృష్ణా హోటల్‌లో ప్రారంభించిన ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఆకృతి డైరెక్టర్ శశినాథ ప్రారంభించిన ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 26వ తేదీ వరకు అందుబాటులో ఉంటుంది.

సంప్రదాయ వంటకాలే ఆరోగ్యకరం



సాక్షి, సిటీబ్యూరో: సంప్రదాయ భారతీయ ఆహారపు అలవాట్లు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని, ఆధునిక జీవనశైలిలో భాగంగా తీసుకుంటున్న పలు ఉత్పత్తులు అనారోగ్యకరమని మాస్టర్ చెఫ్ సంజీవ్ కపూర్ అభిప్రాయపడ్డారు. ఏఐజీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ 33వ వార్షిక సదస్సు (ఐఏఎస్‌జీసీఓఎన్) హెచ్ఐసీసీలో శనివారం ముగిసింది. ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ... శక్తివంతమైన ఆరోగ్యానికి గట్ మైక్రోబయోమ్ (మంచి బాక్టీరియా) మూలమని తాము నిర్వహించిన ఓ అధ్యయనం ద్వారా నిర్ధారించామన్నారు. జాతీయ అంతర్జాతీయ వక్తల ప్రసంగాలతో 100 గంటలపైన సెషన్స్ జరిగాయనీ రికార్డు స్థాయిలో సర్జన్ల నుంచి 580 పరిశోధనా పత్రాలను అందుకున్నామనీ ఏఐజీ హాస్పిటల్స్ డైరెక్టర్, సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ జి.వి.రావు పేర్కొన్నారు.

ముగిసిన నిరుద్యోగ చైతన్య యాత్ర

పంజగుట్ట: పది రోజులుగా నిరుద్యోగులు రెండు బస్సుల్లో నిర్వహించిన నిరుద్యోగ చైతన్య యాత్ర శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ముగిసింది. ఇది ముగింపు కాదు ఆరంభమే అని ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించేవరకు విశ్రమించేది లేదని నిరుద్యోగులు గర్జించారు. ప్రొఫెసర్ రియాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ యాత్ర ముగింపు కార్యక్రమానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు అజయ్ కుమార్, అల్కాలంబ, ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు కన్హయ్య కుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కోదండరెడ్డి, దివ్యవాణి నిరుద్యోగులకు ఆహ్వానం పలికి ఘనంగా సత్కరించారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి మాట్లాడిందే మనం వినాలి మనం చెపితే ఆయన వినడని, ఆయన ఒక డిటేక్టర్‌గా వ్యవహరిస్తాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పండి

ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

పంజగుట్ట: ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సోమాజిగూడ డివిజన్ పరిధిలోని కుందన్‌బాగ్, ఉమానగర్, మెథడిస్ట్ కాలనీల్లో ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ ఇంటింటికి కేసీఆర్ భరోసాను వివరిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డివిజన్‌లో జరిగిన అభివృద్ధి పనులను తెలియజేస్తూ మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి రావడం ద్వారా ఆగిపోయిన సంక్షేమ పథకాలను ముందుకు తీసుకెళ్లేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, భారీ ఎత్తున ప్రజలకు పంపిణీ చేసే కార్యక్రమం వచ్చే నెల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. వేలాది మందికి గృహలక్ష్మి పథకం కింద చెక్కులు మంజూరై తన వద్ద ఉన్నాయని ఎన్నికల కోడ్ రావడం వల్ల వాటిని పంపిణీ చేయలేకపోయానని అన్నారు. ఎన్నికలు కాగానే ఆరు వేల మందికి ఈ చెక్కుల పంపిణీ చేపడతామన్నారు. పింఛన్లు రెట్టింపు అవుతున్నాయని వెల్లడించారు. ఓటుకు నోటు ఇచ్చి కాంగ్రెస్, బీజేపీలు మోసం చేసేందుకు వస్తున్నాయని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వనం సంగీతా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మెథడిస్టు కాలనీలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్





కాంగ్రెస్ పాలనలోనే పేదలకు న్యాయం

ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నెం.5 దుర్గా భవానీనగర్ బస్తీలో శనివారం ఖైరతాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.విజయారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానికులను కలిసి హస్తం గుర్తుకే ఓటు వేయాలంటూ విజ్ఞప్తి చేశారు. తన తండ్రి పీజేఆర్‌లాగా ఎల్లవేళలా అందరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తానని వెల్లడించారు. ఆరు గ్యారంటీలు చూసి ఓటు వేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రూ. 4 వేలు పింఛన్, రూ. 10 లక్షల రాజీవ్‌ఆరోగ్య భీమా పథకం అమలవుతాయని అన్నారు. యువ వికాసం కింద రూ. 5 లక్షల విద్యా భరోసా కల్పిస్తామన్నారు. రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని అందరినీ మోసం చేసిందని వారికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు. పేదలకు కాంగ్రెస్ హయాంలోనే సంపూర్ణ న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు శ్రీను నాయక్, జి. రామాంజనేయులు, డి. రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.







జూబ్లీహిల్స్‌రోడ్ నెం. 5 దుర్గా భవానీనగర్ బస్తీలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి